


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -174-

(25 ఏప్రిల్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

"**నేను చెప్పే ఆచారాలు, నీతి సూత్రాలు**, మొదలైనవన్నీ జన బాహుళ్యం కోసమే. వారు బాగుపడాలనే తాపత్రయం తప్ప నాకు వేరే ఉద్దేశ్యమేమీ లేదు. అసలు నా విషయం నేనాలోచించడమే మహా తక్కువ" అని ఒక పండితోత్తముడు ఎంతో పరోపకారాయ పరాయణత్వం ప్రకటిస్తూ పలికాడట.

ఈయనగారు మంచివాడుగానే కనిపించాడు. ఎందుకంటే జీవితంలోగల యదార్థాన్ని బయటకు చెప్పేశాడు. కొంచెం వంకర తప్పేననుకోండి. అది మాత్రం సుగుణం కాదూ..

అయితే, పనులకోసం ఈయన కొంత తాపత్రయపడటమంటూ వుంది. అది మాత్రం సామాన్యమా? "నువ్వు బ్రతికేది ఇతరులకోసం, నీకోసం కాదు" అనే సూత్రం వుందిగా మనకు.

ఒక మత ప్రచారకుడు పెద్ద పెద్ద సభలలో మహోపన్యాసాలిస్తూ వుండేవాడుట. నీతి నియమాలను గురించి గట్టిగా హెచ్చరిక చేస్తూ వుండేవాడుట. ఆయన మాత్రం మామూలు సమయాలలో మద్యం సేవించి హాయిగా విశ్రమిస్తూ వుండేవాడుట.

ఎవరైనా వెళ్ళి అయ్యగారున్నారా అంటే "భావసమాధిలో వున్నారు. దానిలోనుంచి శక్తి సంపాదించందే ఇతరులకేం బోధించకలుగుతారు?" అని ఇంట్లో వాళ్ళు జవాబు చెప్పేవారుట.

కొంతకాలానికి ఆయనగారి రహస్యం బయటపడిందిట. "ఇదేమిటి స్వామీ! మీరే ఇలా చేస్తే అనుచరులేం అవుతారు? తమరు ఆదర్శమూర్తులుగా నిలవాలి కదా!?" అన్నారుట.

ఆయనగారు నవ్వి, "నాయనా! ఇంతమందికి నీతి బోధిస్తున్నాను. దానివల్ల అందులో కొందరైనా బాగుపడితే చాలదూ? నా ఒక్కడిదీ ఏం లెక్క? ఎవరూ బాగుపడరంటారా? అప్పుడు నేనేం అనుకుంటాను? 'వీళ్ళేదో బాగుపడతారుకదా అని నేను నా సుఖాలు కూడా విడనాడుకోవలసి వచ్చింది. ఈ ప్రమేయం పెట్టుకోకపోతే నేనెంత స్వేచ్ఛగా బ్రతికేవాణ్ణి కదా' అనే బెంగతో కృశించాల్సి వచ్చేది.

అందుకని పరోపకారం మీద ఎక్కువ మక్కువ పెట్టుకుని ప్రచారంలోకి దిగాను. నిజం చెపుతున్నాను. నేనొక్కణ్ణి చెడిపోతే వచ్చే నష్టమేమిటీ? అలసి, పులిసి పోయిన జీవితం.. అట్లపిండి జీవితం. తీయతీయని జీవితాలు. తేనె రసగుల్లాల్లాటి జీవితాలు బాగుపడితే మంచిదిగాని.." అన్నాడుట.

ఈ మహనీయుడు తప్పు చెయ్యడంలో కూడా కొంత పరమార్థం, స్వేచ్ఛ ప్రకటించగలిగాడు. పైగా సత్యాన్ని కూడా చెప్పగలిగాడు. నిజమే కొందరు తప్పు మార్గాలతో గుడ్లప్పగించి శక్తుల్ని ఉపయోగించడం, ఉపజ్ఞ ప్రదర్శించడం జరుగుతూ వుండాలి. ఇలా ఒక విధమైన కళ. ఇలాటివారు గ్రంథాలలో పాత్రలుగా బాగా రాణిస్తారు. గ్రంథకర్తలుగా కూడా రాణించగలరేమో!

ఈ సందర్భంలో బెర్నార్డ్‌షాను గురించి చెస్టర్‌టన్ వెలిబుచ్చిన భావం వినండి.

"షా తప్పు పనులు చేస్తున్నప్పుడు ఎంతో రాణిస్తాడు. అతనిలోగల ధీ శక్తి అంతా వెల్లడి అవుతుంది. పైగా అతడు సామాన్యంగా తప్పులే చేస్తూ వుంటాడు. అతని ప్రవృత్తులూ, కార్యకలాపాలూ అన్నీ తప్పులే. ఒప్పయినదల్లా షా ఒక్కడే" అని చమత్కరించాడు.

చెస్టర్‌టన్‌లో ఒక ప్రత్యేకత వుంది. అతడు ఇతరులని ఎలా విమర్శిస్తాడో, తనను కూడా అలాగే విమర్శించుకోగలగడమే ఆ ప్రత్యేకత. "తనను గురించి తను నవ్వుకోగల వ్యక్తి" అనే బిరుదు వుందాయనకు.

ఈ వ్యాసం మొదటలో పేర్కొన్న మత ప్రచారకునిలాగా, అందరికీ నీతులు చెపుతాను నా సంగతి నేను చూసుకుంటాను – అనే పద్ధతిలో వాడు కాదు ఈ రచయిత. తన తప్పులు, తన దురలవాట్లు తను బయటపెట్టుకుంటూ బయటవాళ్ళను విమర్శించేవాడు. అందులో మళ్ళీ ఒక ప్రత్యేకత. వారి చేష్టల్ని వెక్కిరించేవాడు. వ్యక్తుల్ని గౌరవించేవాడు. తన విషయంలో వ్యక్తిత్వాన్ని గురించి చెప్పుకోవడానికి అవకాశం లేదు గనుక, తప్పుల్నే తమాషాగా చెపుతూ వుండేవాడు. ఈయనగారు బీర్ ఎక్కువగా త్రాగుతూ వుండేవాడు. ఆ మత్తులో అనేక మతిమరుపు పనులు చేస్తూ వుండేవాడు. రైల్వే బుక్కింగ్ ఆఫీసుకి వెళ్ళి డబ్బులు గిరాటువేసి కప్పు టీ తెమ్మనేవాడు. త్రాగి తన యింటికి వచ్చి గది తాళం పెట్టివుంటే తాళం చెవి జేబులో వున్నమాట మరచిపోయి స్క్రూలు తెచ్చి ఒకసారి తలుపు బందులు వూడదూశాడు.

ఒకసారి మిత్రుడి హాట్ లోపలికి తీసుకుపోయి, దాన్ని తిరగేసి దాంట్లో నాలుగు కోడిగ్రుడ్లు పడేసి స్టౌమీద పెట్టి వచ్చి హాలులో కూర్చున్నాడు. ఒక మిత్రుడు వెళ్ళబోతుంటే ఆపి "కొంచెం వుండు సూప్ తీసు తీసుకువెడుదువుగాని" అని అతన్ని కూర్చోబెట్టి లోపలకు వెళ్ళాడు. హాట్, ఎగ్స్ మాడిపోయానాయి.

నవ్వుకుంటూ బయటికి వచ్చి "హాట్ కోడిగ్రుడ్లు మ్రింగింది. దాన్ని స్టవ్ ఆరగించింది. మీరు వెళ్ళిరావచ్చు. నేను కోడిగుడ్లు మళ్ళీ కొనుక్కోవాలి. మిత్రుడు సాల్మన్ మళ్ళీ హాట్ కొనుక్కోవాలి" అన్నాడుట. జరిగిన తమాషా అంతా తెలిసి మిత్రులందరూ నవ్వుకుని, ఇది దానికంటె మించిన రిపార్టీ అని సంతోషించారట.

ఒకసారి ఈ మహారచయిత తప్ప త్రాగివున్న సమయంలో ఎక్కడ దొరికిందో ఒక అసలైన పదునైన ఖడ్గం చేతికి అందిందట. అది గిరగిరా తిప్పుతూ బయలుదేరాడుట. కోరడి అవతల ఒక వ్యక్తి కనబడ్డాడు. వెంటనే కోరడి లంఘించి అతనిమీద కలబడ్డాడట. మొత్తానికి అవతల వాడికేమి అపాయం జరగలేదు.

ఈ విషయాన్ని గురించి చెస్టర్‌టన్ తర్వాత ప్రసంగిస్తూ –

"నేను కోరడీ దూకడం వగైరాలు విచిత్రంగానే కనపడవచ్చు. కాని అతడెందుకని ప్రమాద స్థితిలో పడలేదో తెలుసా? అతగాడు నాకన్నా తప్పత్రాగి వున్నాడు. నేనెంత సవాల్ చేసినా అతగాడు లేచి సవాల్ అందుకోలేదు. చచ్చువెధవ వీడితో యుద్ధమేమిటని చక్కా వచ్చాను. లేచి ఏ మాత్రం సవాల్ చేసినా వాడి తల ఎగిరిపోయేది. నా తల సంగతి తరవాత తేలేది" అన్నాడు.

ఒకసారి చేస్టర్‌టన్ ఇంటికి ఫోను చేశాడుట. భార్య "ఎక్కడనుంచి?" అని ప్రశ్నించిందిట. అది విని "ఎక్కడనుంచి అని ప్రశ్నిస్తున్నావా? నేనే వెర్రిదానా! ఎక్కడనుంచి ఫోనుచేస్తాను ఇంత హుషారుగా.. బీర్ మార్కెట్" అన్నాడుట సగర్వంగా.

చెస్టర్‌టన్ తన రచనలద్వారా చాలా నీతులు చెప్పాడు. చాలామందిని విమర్శించాడు కూడా. కాని తన విషయం వచ్చేసరికి ఏదీ దాచకుండా నిజం చెప్పేవాడు. దానివల్ల అతనికెంతో పేరు వచ్చింది.

"నే చెప్పే నీతులన్నీ ఇతరులకోసమే. నే చేసేదంతా పరోపకారమే. నా సంగతంటారా.. అది మీకెందుకు?" అనే పద్ధతి పెద్ద మనుష్యుల చరిత్రలు విడ్డూరంగా ఉంటాయి.

Post your comments